పోలింగ్.. ప్రశాంతం

క్లుప్తంగా

ఓట్లు.. పాట్లు

బెల్లంపల్లి: నియోజకవర్గంలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బాబుక్యాంపు బస్తీ వాణినికేతన్ పాఠశాల 86వ పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య సాయంత్రం సందర్శించారు. చిన్నయ్యతోపాటు ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కేంద్రంలోకి వెళ్లడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఓటర్లు అభ్యంతరం చెప్పారు. దీంతో కౌన్సిలర్లు గొడవకు దిగారు. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బజారు ఏరియాలోని శాఖ గ్రంథాలయం పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఉండడంతో బీఆర్ఎస్ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ అభ్యంతరం వ్యక్తం చేశా రు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మ ధ్య వివాదం ఏర్పడింది. బజారు ఏరియాబ్రాంచ్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉదయం ఈవీఎం మొరాయించడంతో దాదాపు గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. బాలికల ఉన్నత పాఠశాలలో పో లింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ఎండలో నిలబ డాల్సి వచ్చింది. తాగునీరు లేక దప్పిక తీర్చుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. కొందరు ఓటర్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌కు ఫిర్యాదు చేయడంతో సౌకర్యాలు కల్పించారు. ఓ ఓటరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్‌కు ఓటేసే ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ సదయ్య పర్యవేక్షించారు.

తగ్గిన పోలింగ్ శాతం

చెన్నూర్: నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ శాతం తగ్గింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 82.33 శాతం నమోదు కాగా, ఈసారి 79.97 శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే 2.36 శాతం తగ్గింది. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,64,296 మంది ఓటర్లుండగా 1,35,175 మంది ఓటు వినియోగించుకున్నారు. 504 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. గత ఎన్నికల్లో మొత్తం 1,35,679 మంది ఓటు వినియోగించుకున్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 79.97 శాతం పోలింగ్ నమోదైనప్పటికీ ఓటర్లు పెరిగారు. నియోజకవర్గంలో 2023 ఎన్నికల్లో 1,88,283, ఓటర్లుండగా 79.97 శాతం పోలింగ్ నమోదైంది. 1,50,566 మంది ఓటు వేశారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో పోలింగ్ తగ్గినా ఓటర్లు 14,887 మంది పెరిగారు.



మంచిర్యాలటౌన్: మొదటిసారి ఓటు వేసి...

- అక్కడక్కడా ఈవీఎంల మొరాయింపు
- గడువు ముగిసే వరకు బారులు తీరిన ప్రజలు
- పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఓటర్లు పోటెత్తారు. భారీ సంఖ్యలో పాల్గొని ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యంలో కీలక పాత్రగా మారారు. జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కొన్నిచోట్ల 4గంటల తర్వాత కూడా ఓట్లు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగుల సౌకర్యార్థం వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ కట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్.. కొన్ని కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడం, ఇతరత్ర సమస్యల వల్ల 20నిమిషాల నుంచి అరగంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మంచిర్యాల పట్టణంలోని డీఎఫ్‌వో కార్యాలయంలోని 147పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో, టెక్నీషియన్లు వచ్చి సరిచేయడంతో 20నిమిషాలు ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. హమాలివాడలోని 211పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలో ఓటు నమోదు ఆలస్యం వల్ల సాయంత్రం 5గంటలైనా పెద్ద ఎత్తున ఓటర్లు క్యూలైన్‌లోనే ఉన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు హమాలివాడ, పాతమంచిర్యాలలోని పోలింగ్ కేంద్రాల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో సరైన లైటింగ్ లేక చీకటిగా ఉండడంతో, గుర్తులు సక్రమంగా కనిపించడం లేదని ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం 4గంటల వరకు 64.20శాతంగా పోలింగ్ నమోదైంది. పాతమంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలోనూ సాయంత్రం 4తరువాత 200లకు పైగా ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్నారు.

పాతమంచిర్యాలలో ఘర్షణ..

పాతమంచిర్యాలలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. ఒకరిపై ఒకరు దాడులకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు వచ్చి పోలింగ్ కేంద్రానికి ఫోన్ తీసుకెళ్లడం, అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దివాకర్‌రావు ఫోన్‌ను తీసుకెళ్లేందుకు నిరాకరించారని ఆరోపణలతోనే ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఏసీపీ తిరుపతి రెడ్డి చేరుకుని, ఇరువర్గాలను పంపించి వేయడంతో వివాదం సద్దుమణిగింది.

నస్పూర్: పట్టణ పరిధిలో 68,608మంది ఓటర్లకు గాను 28పోలింగ్ కేంద్రాలు 71పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సీతారాంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలింగ్ సమయం 4గంటలు దాటిన తరువాత సైతం ఓటర్లు భారీ ఎత్తున క్యూలైన్లలో వేచి ఉన్నారు. పోలింగ్ సిబ్బంది వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. సీసీసీలోని రేడియెంట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఏసీపీ తిరుపతిరెడ్డి పరిశీలించారు. సీసీసీ సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం, సీసీసీలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉమెన్ మేనేజ్‌డ్ పోలింగ్ స్టేషన్లు ఓటర్లను ఆకట్టుకున్నాయి.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ, అంబేద్కర్ కాలనీలోని 4పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అంబేద్కర్ నగర్ కాలనీ పోలింగ్ బూత్‌కు 4గంటల ఒక్క నిమిషానికి వచ్చిన ఇయాజ్‌ను పోలింగ్ కేంద్రంలోకి వెళ్తుండగా గేట్ వద్దే బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో పోలీసులు గేట్లకు తాళాలు వేసి, లేట్‌గా వచ్చిన ఓటర్లను అనుమతించలేదు.

లక్సెట్టిపేట...

లక్సెట్టిపేట: మండలంలో 47పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వెంకట్రావుపేటలోని పోలింగ్ బూత్‌ను ఏసీపీ తిరుపతి రెడ్డి పరిశీలించారు. తిమ్మాపూర్‌లోని పోలింగ్ బూత్ వద్ద టెంటు వేయకపోవడంతో ఓటర్లు ఎండలోనే క్యూలో నిలుచున్నారు. బలరావుపేటలో ఈవీఎం మొరాయించింది. జెండావెంకటాపూర్‌లోని పోలింగ్ బూత్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. సాయంత్రం ఆరు గంటల వరకు 68శాతం పోలింగ్ నమోదైంది.



జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

హాజీపూర్‌లో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో 17గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఓటు హక్కుని వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎన్నికల అధికారులు మాక్ పోలింగ్ జరిపి పోలింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అయితే మండలంలోని నంనూర్‌లోని 124పోలింగ్ కేంద్రంలో వీవీ ప్యాట్ మొరాయించడంతో దాని స్థానంలో మరొకటి ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ముల్కల్లలోని 126వ పోలింగ్ కేంద్రం, గుడిపేటలోని 117వ పోలింగ్ కేంద్రంలో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. 4గంటలక ఓటింగ్ సమయం ముగియడంతో పోలింగ్ అధికారులు గేట్లకు తాళాలు వేశారు. ముల్కల్ల, వేంపల్లి, దొనబండ, హాజీపూర్, రాపల్లి గ్రామాల్లోని ఓటర్లకు టోకెన్‌లు అందించారు. దీంతో అదనంగా గంటకు పైగా సమయాన్ని వెచ్చించిన ఓటర్లు వరసలో వేచి ఉండి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



దండేపల్లి: మామిడిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఏసీపీ

దండేపల్లి: మండలంలో 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 5రూట్లుగా విభజించి, అధికారులు ఎప్పటికప్పుడు పోలింగ్ తీరును పర్యవేక్షించారు. సా యంత్రం ఐదు గంటల వరకు కొన్ని చోట్ల 50శాతం పైగా, మరికొన్ని చోట్ల 80శాతంకు పైగా పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ సమ యం 4గంటల వరకే కావడంతో పోలింగ్ కేంద్రాల గేట్లను మూసి వేసి, గేటు లోపల ఉన్న వారిని మాత్రమే ఓటేసేందుకు అనుమతి చ్చారు. దండేపల్లి, తాళ్లపేట, ముత్యంపేట లో ఈవీఎంలు మొరాయించాయి. కాసిపేట పో లింగ్ కేంద్రానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు తనయుడు వెళ్లడంతో విజిత్‌రావు గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేయడంతో ఆయన అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లారు. పోలింగ్ కేంద్రాలను ఏసీపీ తిరుపతిరెడ్డి సందర్శించారు.



ఓటు వేసేందుకు పరుగుతో వెళ్తున్న యువకులు



ముల్కల్లలో గేట్‌కు తాళం వేస్తున్న అధికారులు



పాతమంచిర్యాల: అండాళమ్మకాలనీలో పోలింగ్



మోడల్ పోలింగ్ కేంద్రం



లక్సెట్టిపేట: వృద్ధుడికి సాయం



మంచిర్యాలటౌన్: కార్యకర్తలతో మాట్లాడుతున్న ఏసీపీ



సారంగపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు



సుందరసాల వద్ద బారులు తీరిన ఓటర్లు



పొన్నారంలో ఇరుకిరుకుగా నిల్చున్న ఓటర్లు

చెన్నూర్ నియోజకవర్గంలో..

చెన్నూర్‌రూరల్: మండలంలో 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ప్రజలు క్యూలైన్లలో ఇబ్బంది పడ్డారు. సమస్యాత్మక గ్రామాలైన బుద్దారం, కన్నెపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య చిన్న వాగ్వాదాలు జరిగాయి. కిష్టంపేటలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాల్క సుమన్ సందర్శించారు. ఓటింగ్ తీరును తెలుసుకున్నారు.

జైపూర్ మండలంలో...

జైపూర్: మండలంలో 20గ్రామ పంచాయతీలో 35పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై ఉపేందర్ రావు, తెలంగాణ పోలీసులతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు.

మందమర్రిలో..

మందమర్రిరూరల్: మందమర్రిలో పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటు వేయడానికి ఆలస్యమైంది. శంకర్‌పల్లి గ్రామ పంచాయతీలో ఈవీఎం పనిచేయకపోవడంతో మరో ఈవీఎంను మార్చిన తర్వాత ఓటు వేయడం ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.

కోటపల్లిలో..

కోటపల్లి: మండలంలో 31 పంచాయతీల్లో 33పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ కోటపల్లి తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. మల్లంపేట, సర్వాయిపేట, ఎసన్‌వాయి, ఎడగట్ట, పిన్నారం, పార్‌పల్లి పొలింగ్ కేంద్రాలను చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వివేక్ వెంకటస్వామి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. దేవులవాడ, సిర్సా గ్రామాల్లో పోలీసు బందోబస్తు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఓటు వేసేందుకు జనం ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకూ పోలింగ్ సాగింది.

భీమారం మండలంలో...

భీమారం: మండలంలో ని 11గ్రామపంచాయతీల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా 82 శాతం పోలింగ్ నమోదు ఆయింది. ఓటు వేసేందుకు యువకులు ఆసక్తి చూపారు. హైదరాబాద్, కరీంనగర్, మంచిర్యాల పట్టణాల్లో చదువుకుంటున్న యువకులతో పాటు ఉద్యోగాలు చేస్తున్న యువతీ, యువకులు తరలివచ్చారు.



ఆర్కేపీలో క్యూలో నిల్చున్న బాల్కసుమన్

క్యాతనపల్లిలో...

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓ పోలింగ్ సెంటర్‌లో ఈవీఎంలో సాంకేతిక సమస్య తలెత్తగా టెక్నీషియన్ల సాయంతో సరిచేయించారు. చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్కసుమన్, కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. క్యాతనపల్లిలో బాల్కసుమన్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీగా మొహరించారు.



భీమారం: క్యూలో నిల్చున్న ఓటర్లు



జైపూర్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు



కిష్టంపేట పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న సీఐ



బట్వాన్‌పల్లి పోలింగ్ కేంద్రంలో...



వేమనపల్లిలో..



మాదారం పోలింగ్ బూత్‌లో బారులు

బెల్లంపల్లి నియోజకవర్గంలో..

బెల్లంపల్లిరూరల్: మండలంలో 84.36ఓటింగ్ శాతం నమోదైంది. 17 గ్రామ పంచాయతీల్లో 29పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 22403మంది ఓటర్లు ఉండగా 18900మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. చంద్రవెల్లిలోని పోలింగ్ కేంద్రంలో అరగంట పాటు ఈవీఎం మిషన్ మొరాయించడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. పలు కేంద్రాల్లో సరిపడా షామియానాలు, తాగునీటి వసతి ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు అవస్థలు పడ్డారు. పాతబెల్లంపల్లి, ఆకెనపల్లి పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య పరిశీలించి స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నెన్నెలలో 84శాతం పోలింగ్

నెన్నెల: మండలంలో 23పోలింగ్ కేంద్రాల్లో 230మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. మొత్తం 84శాతం పోలింగ్ నమోదైంది. 18,776 ఓట్లు ఉండగా 15,815ఓట్లు పోలయ్యాయి. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్, నెన్నెల ఎస్సై శ్యాంపటేల్, ఎంపీడీఓ వరలక్ష్మి పోలింగ్ తీరును సమీక్షించారు.

వేమనపల్లిలో 87.99శాతం పోలింగ్

వేమనపల్లి: మండలంలోని మూడు రూట్‌లలోని 22పోలింగ్ బూత్‌లలో 87.99పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం 14,699 ఓట్లకు గాను 12,934ఓట్లు పోలయ్యాయి. రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో బందోస్తు నిర్వహించారు.

తాండూర్‌లో 78.51శాతం పోలింగ్

తాండూర్: మండలంలో 15గ్రామ పంచాయతీల్లో 37పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. 26739ఓటర్లకు గాను 20994మంది ఓటును వినియోగించుకున్నారు. మండలంలో 78.51శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ సందర్శించి పోలింగ్ తీరును పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య తాండూర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. మాదారంలో గల 132 పోలింగ్ బూత్‌లోని ఈవీఎం మొరాయించడంతో గంట పాటు అంతరాయం ఏర్పడింది. 123పోలింగ్ కేంద్రంలో గల ఈవీఎంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో దాదాపు 20నిమిషాల పాటు పోలింగ్ నిలిచింది.

కాసిపేటలో 78శాతం నమోదు



ఓటు వేసేందుకు ట్రాక్టర్లలో వచ్చిన కరిశలఘట్టం గిరిజనులు

కాసిపేట: మండలంలో 78శాతం పోలింగ్ నమోదైంది. 35పోలింగ్ కేంద్రాలు, నాలుగు రూట్లు ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 26868కాగా 21193మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఈవీఎం సీజ్ చేసి తరలించారు.

భీమిని: భీమిని మండలంలోని 15పోలింగ్ బూత్‌లు, కన్నెపల్లి మండలంలోని 20పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. భీమిని మండలంలోని కేస్లాపూర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య, వెంకటాపూర్, వీగాం గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది.



నెన్నెల: దివ్యాంగురాలిని తీసుకొస్తున్న సిబ్బంది



భీమినిలో సమయం దాటిపోవడంతో వెనుదిరుగుతున్న ఓటర్లు



కాసిపేటలో లైన్‌లో నిల్చున్న మహిళలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాన్సన్ నాయక్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బొజ్జు

ఖానాపూర్ నియోజకవర్గంలో 72.6శాతం పోలింగ్

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండలంలోని టీజీ పల్లి, గాంధీనగర్ ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యం అయింది. పది గంటలు దాటకా ఓటర్ల సంఖ్య పెరిగింది. కొన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల సమీపం వరకు వాహనాలను తీసుకెళ్లడం వల్ల ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. అధికారులు 500మీటర్లు దూరంలో గీతలు పెట్టినా, అవేమి పట్టనట్లు కొందరు పోలింగ్ కేంద్రం ముందుకు వాహనాలను తీసుకెళ్లారు. నియోజక వర్గంలో ఉదయం 11గంటల వరకు 27.07 శాతం, మధ్యాహ్నం 1గంట వరకు 43.05శాతం, మధ్యాహ్నం 3గంటల వరకు 58.20శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 5దాటాక కూడా పొనకల్, జన్నారం, మురిమడుగు గ్రామాల్లో ఓటర్లు బారులు తీరడంతో గేట్ వేసి లోపల ఉన్న వారికే ఓటు వేసేందుకు అనుమతి ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా 72.6శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు